RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక



బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

www.nityamnigha.com
RNI. TGTEL/25/A1665
నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక
NITYAM NIGHA TELUGU DAILY
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా
Published From : Warangal
Circulated at : Telangana All Districts



వరంగల్ | సంపుటి 2 | సంచిక 80 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | సోమవారం | 21.09.2026 | పేజీలు : 8

మనవాళ్లు చైనాకు పట్టుబడ్డప్పుడు
నా పనైపోయిందనుకున్నా
- అజిత్ దోవల్

- యువ ఐపీఎస్ అధికారిగా ఉన్నప్పటి ఘటనను గుర్తుచేసుకున్న డోభాల్
- ఆయన పంపిన నిఘా బృందాన్ని చైనా సైన్యం అదుపులోకి తీసుకుంది
- ఈ ఘటనతో తన కెరీర్ ముగిసిపోయిందని భావించినట్లు వెల్లడి
- ఐఐటీ రూర్కీ స్నాతకోత్సవంలో పాత జ్ఞాపకాలను పంచుకున్న డోభాల్

2



పాలిటెక్నిక్ విలీనంపై యూటర్న్..
విద్యార్థుల ఉద్యమంతో దిగొచ్చిన సర్కార్..!

- యూనివర్సిటీలో పాలిటెక్నిక్ విలీన ప్రతిపాదనను ఉపసంహరించుకున్న ప్రభుత్వం
- జీవో 97కు వ్యతిరేకంగా 37 రోజుల పాటు సాగిన విద్యార్థుల ఉద్యమం విజయం
- సీఎం రేవంత్ రెడ్డికి కేకే కమిటీ నివేదిక సమర్పణతో ముగిసిన ప్రతిష్టంభన
- సాంకేతిక విద్యాశాఖ, ఏఐసీటీఈ నిబంధనల ప్రకారమే యథాతథంగా పాలిటెక్నిక్ విద్య

2

ఈ నెల 30 లోపు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి.. లేదా
సంక్షేమ పథకాలు కట్
- రైతులకు కీలక అలెర్ట్



కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాలు, సబ్సిడీలు అందాలంటే ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు ఐడీ తప్పనిసరి.

సెప్టెంబర్ 22 నుంచి 30 వరకు స్థానిక వ్యవసాయ అధికారుల పర్య వేక్షణలో నేరుగా నమోదు ప్రక్రియ.

ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్, మొబైల్ నంబర్ ఉంటే నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తి.

పంట రుణాలు, ఎరువుల కొనుగోలు, మద్దతు ధరల చెల్లింపులకు ఈ ఒక్క ఐడీయే కీలకం.

నిత్యం నిఘా, హైదరాబాద్ : తెలంగాణ రైతులకు ప్రభుత్వం ముఖ్యమైన సూచన చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు పొందాలంటే రైతులు అందరూ ఫార్మర్ రిజిస్ట్రీలో తప్పనిసరిగా నమోదు చేసు కోవాలని సూచించింది. ఈ నెల 30వ తేదీలోపు ఈ ప్రక్రియ పూర్తి చేసుకోకపోతే ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతాయని హెచ్చరించింది. కేంద్ర ప్రభుత్వం ఒకే రైతు .. ఒకే గుర్తింపు.. సమగ్ర సేవలు అన్న కాన్సెప్ట్ తో రైతుల కోసం ఫార్మర్ రిజిస్ట్రీని ప్రవేశపెట్టింది. ఇందులో నమోదు చేసుకుంటే ప్రతి రైతుకు ఒక యూనిక్ ఐడీ వస్తుంది. ఈ ఐడీ ద్వారా రైతులను సులభంగా గుర్తించి, సంక్షేమ పథకాలు అందించవచ్చు. పీఎం కిసాన్, రైతు భరోసా వంటి పథకాలు పొందాలంటే ఈ ఐడీ తప్పనిసరి. సెప్టెంబర్ 22 నుంచి 30 వరకు తొమ్మిది రోజుల ....

2



తెలంగాణ కాంగ్రెస్‌లో కీలక మార్పులు..
మూడు జిల్లాలకు కొత్త అధ్యక్షులు

రంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలిగా చిగిరింత పారిజాత

సంగారెడ్డి అధ్యక్షుడిగా పటోళ్ల చంద్రశేఖర్ రెడ్డి

రామగుండం కార్పొరేషన్ అధ్యక్షుడిగా ఎండీ ముస్తఫా

పార్టీ బలోపేతం దిశగా ఏఐసీసీ చర్యలు



నిత్యం నిఘా, హైదరాబాద్ : తెలంగాణ కాంగ్రెస్ సంస్థాగత బలోపేతం దిశగా పార్టీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. 'సంఘటన్ సృజన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మూడు జిల్లా కాంగ్రెస్ కమిటీలకు (డీసీసీ) నూతన అధ్యక్షులను నియమించింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదంతో పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ నియామక ఉత్తర్వులను విడుదల చేశారు. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఆయన స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలిగా చిగిరింత పారిజాత, సంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా పటోళ్ల చంద్రశేఖర్ రెడ్డి, రామగుండం కార్పొరేషన్ డీసీసీ అధ్యక్షుడిగా ఎండీ ముస్తఫా నియమితులయ్యారు. హైదరా బాద్ మహానగరానికి సమీపంలో ఉండే రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలు రాజకీయంగా అత్యంత కీలకమైనవి కాగా, రామగుండం ప్రధాన పారిశ్రామిక ప్రాంతం కావడంతో పార్టీ ఇక్కడ ప్రత్యేక దృష్టి సారించింది. దేశ వ్యాప్తంగా పార్టీని జిల్లా స్థాయిలో బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ చేపట్టిన పునర్‌వ్యవస్థీకరణ చర్యల్లో భాగంగానే ఈ నియామకాలు జరిగినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

ఎల్నినో కంటే రేవంత్ రెడ్డే ప్రమాదకరం
- హరీశ్ రావు

- అవకాశం ఉన్నా కరెంట్ ఇవ్వకుండా లేని కరవును సృష్టిస్తున్నారంటూ హరీశ్ రావు ఫైర్
- 24 గంటల కరెంట్ పోయి 6-7 గంటలకే పరిమితమైందని విమర్శలు
- మూడు పంటల నుంచి రైతుబంధు పెండింగ్‌లో పెట్టారని ఆరోపణ

2



కరీంనగర్‌లో దొంగల హల్‌చల్..
గ్యాస్ కట్టర్లతో 2 ఏటీఎంలు లూటీ

- కరీంనగర్‌లో రెండు ఎస్‌బీఐ ఏటీఎంలలో భారీ చోరీ
- గ్యాస్ కట్టర్లతో మిషన్లు ధ్వంసం చేసి నగదు అపహరణ
- దొంగల ముఠాలో మహిళ.. సీసీటీవీ ఫుటేజీలో గుర్తింపు
- మహారాష్ట్ర రిజిస్ట్రేషన్ వాహనంలో పరారైన దుండగులు

2



దళితుల భూముల్లో
అంగుళం కూడా తీసుకోం..
ఆయన మాటలు నమ్మొద్దు - మంత్రి పొంగులేటి



కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణ నేపథ్యంలో దళిత రైతులకు నోటీసులు

దళితుల భూములపై మంత్రి పొంగులేటి భరోసా

భూ రికార్డుల పరిశీలన హక్కుల పరిరక్షణకేనని, భూసేకరణ కాదని వివరణ

కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపణ

2

నేను వాళ్లూ, వీళ్లూ వదిలిన బాణాన్ని కాదు : కవిత

- కొడంగల్‌లో పాంచజన్య సంకల్ప సభ
- కొడంగల్ గడ్డపై నుంచి చెబుతున్నా.. నేను ఎవరి బాణాన్ని కాదు అంటూ కవిత వ్యాఖ్యలు
- అధికారానికి దూరంగా ఉన్న బహుజనుల బాణాన్ని నేనని వ్యాఖ్య
- యువత, బహుజనుల కోసం ఎవరితోనైనా పోరాడు తానని ప్రకటన



నిత్యం నిఘా, కొడంగల్ : తాను వాళ్లూ వీళ్లూ వదిలిన బాణాన్ని కాదని, దశాబ్దాలుగా అధికా రానికి, విద్యకు దూరంగా ఉన్న బహుజనుల బాణాన్ని అని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. యువత, బహుజనుల హక్కుల కోసం ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌తో అయినా కొట్లాడటానికి సిద్ధమని ఆమె ప్రకటించారు. వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో ఆదివారం నిర్వహించిన 'పాంచజన్య సంకల్ప సభ'లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభకు ముందు కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీగా వేదిక వద్దకు చేరుకున్న కవిత, తన రాజకీయ వైఖరిని వివరిస్తూ ప్రత్యర్థులపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "నన్ను కాంగ్రెస్ వదిలిన బాణమని బీఆర్ఎస్ వాళ్లు, కేసీఆర్ వదిలిన బాణమని రేవంత్‌రెడ్డి అంటున్నారు. మరికొందరు తలకాయ లేనివాళ్లు బీజేపీ బాణమని మాట్లాడుతున్నారు. కొడంగల్ గడ్డపై నుంచి నేను ఒక్కటే . నేను తెలంగాణ బహుజనుల బాణాన్ని. యువజనుల యుద్ధ నినాదాన్ని. అంబేడ్కర్ వాదాన్ని, మహాత్మ జ్యోతిబా ఫులే ఆత్మగౌరవ నినాదాన్ని నేను" అని కవిత ఉద్ఘాటించారు..

2

ఈ నెల 30 లోపు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి.. లేదా

సంక్షేమ పథకాలు కట్

- రైతులకు కీలక అలెర్ట్

మొదటిపేజీ తరువాయి.. పాటు గ్రామాల్లో ప్రత్యేక క్యాంపెయిన్లు నిర్వహిస్తున్నారు. అధికారులు గ్రామాలకు వచ్చి ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేస్తారు. లేదా రైతులు మండల పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద కూడా నమోదు చేసుకోవచ్చు. ఇప్పటికే నమోదు అయినవారు మళ్లీ చేసుకోవాల్సిన అవసరం లేదు. రైతులు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు కోసం ఆధార్ కార్డు, భూమి పాస్‌బుక్, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్ ఉంటే చాలు. ఐడీ వచ్చిన తర్వాత దాన్ని నోట్ చేసుకుంటే సరిపోతుంది. ఈ ఐడీ వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర పథకాలు, రాయితీలు, సబ్సిడీలు పొందవచ్చు. బ్యాంకుల నుంచి పంట రుణాలు తీసుకోవడం సులభం అవుతుంది. ఎరువులు బుక్ చేసుకోవడానికి, వరి, పత్తి, మొక్కజొన్న, కంది వంటి పంటలకు కనీస మద్దతు ధర పొందడానికి కూడా ఉపయోగపడుతుంది. మీ ఐడీ నంబర్ తెలుసుకోవాలంటే https://tlfr.agristack.gov.in/farmer-registry-tl/#/check-EnrolmentStatus లింక్‌లో ఆధార్ నంబర్ ఎంటర్ చేసి, ఓటీపీ వేస్తే స్క్రీన్‌పై కనిపిస్తుంది. రైతులందరూ ఈ అవకాశాన్ని వదలకుండా సమయానికి నమోదు చేసుకోవాలని ప్రభుత్వం కోరుతోంది. ఈనెల 30 వతేదీ వరకే డెడ్ లైన్ కావటంతో అసలే మరచిపోవద్దని పేర్కొంది.

ఎల్ నినో కంటే రేవంత్ రెడ్డే ప్రమాదకరం

- హరీశ్ రావు

మొదటిపేజీ తరువాయి.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రకృతి విపత్తు అయిన ఎల్ నినో కంటే రేవంత్ రెడ్డే రాష్ట్రానికి అత్యంత ప్రమాదకరమని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కరెంట్ కోతలు విధిస్తూ, నీళ్లు ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెడుతోందని, రాష్ట్రంలో లేని కరవును సృష్టిస్తోందని ఆరోపించారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులో పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హరీశ్ రావు మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న సర్వేలన్నీ కేసీఆర్‌కు అనుకూలంగా ఉన్నాయని, అందుకే కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు పెరిగాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని చెప్పుకుంటూనే రాక్షస పాలన సాగిస్తోందని విమర్శించారు. "అవకాశం ఉన్నప్పటికీ విద్యుదుత్పత్తి చేయకుండా బొగ్గు కొరత అనే సాకుతో కరెంట్ కోతలు విధిస్తున్నారు. కేసీఆర్ గారి హయాంలో 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తే.. ఇప్పుడు కేవలం 6-7 గంటల నాణ్యత లేని విద్యుత్ మాత్రమే వస్తోంది. దీంతో పంటలు ఎండిపోతున్నాయి. కృష్ణా నదిలో నీళ్లున్నా కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి లిఫ్టులను ఆన్ చేయడం లేదు," అని హరీశ్ రావు మండిపడ్డారు. మూడు పంటల నుంచి రైతుబంధు నిధులు విడుదల చేయలేదని, కరోనా కష్టకాలంలో కూడా కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు ఆపలేదని గుర్తుచేశారు. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిపై ప్రమాణం చేసి కూడా సీఎం రేవంత్ రెడ్డి దేవుణ్ని మోసం చేశారని ఆరోపించారు. బాండ్ పేపర్లపై ఇచ్చిన 420 హామీలు, గొర్రెల పంపిణీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాల ఊసే లేదని విమర్శించారు. తనను ప్రశ్నించినందుకు పిట్ట బెదిరింపులకు పాల్పడితే భయపడేది లేదని, ఆయన సంగతి చూస్తామని హెచ్చరించారు. "కేసీఆర్‌పై బురద చల్లితే రైతులకు న్యాయం జరగదు. పాలించడం చేతకాకపోతే నుదుటిపై 'నామమ్' రాసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలి" అని హరీశ్ రావు హితవు పలికారు.

కరీంనగర్‌లో దొంగల హల్‌చల్..

గ్యాస్ కట్టర్లతో రెండు ఏటీఎంలు లూటీ

మొదటిపేజీ తరువాయి.. కరీంనగర్ పట్టణంలో ఇవాళ తెల్లవారుజామున దొంగలు రెచ్చిపోయారు. పట్టణంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఏటీఎంలను లక్ష్యంగా చేసుకుని భారీగా నగదును అపహరించుకుపోయారు. గ్యాస్ కట్టర్ల సహాయంతో ఏటీఎం మిషన్లను ధ్వంసం చేసి, లోపలున్న నగదుతో పరారయ్యారు. ఈ ఘటనలు పోలీసులకు సవాలుగా మారాయి. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుర్శేడ్, ఎల్ఎండీ పోలీస్ స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్‌లో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలలో ఈ చోరీలు జరిగాయి. దుర్శేడ్ ఏటీఎంలోకి తెల్లవారుజామున 3:30 గంటల సమయంలో కారులో వచ్చిన ఇద్దరు దుండగులు, వారిలో ఒక మహిళ కూడా ఉన్నట్లు సీసీటీవీ ఫుటేజీ ద్వారా పోలీసులు గుర్తించారు. ఏటీఎంలోకి ప్రవేశించగానే వారు సీసీ కెమెరాలపై ఒక రకమైన ద్రవాన్ని చల్లి, ఆ తర్వాత గ్యాస్ కట్టర్‌తో మిషన్‌ను కట్ చేశారు. ఈ ఏటీఎం నుంచి సుమారు రూ.8 లక్షలు అపహరించినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. తిమ్మాపూర్ ఏటీఎంలో ఎంత నగదు పోయిందనేది ఇంకా తెలియరాలేదు. దొంగతనానికి పాల్పడినప్పుడు నిందితులు టోపీలు, కళ్లద్దాలు, మాస్కులు, గ్లోవ్‌లు ధరించి తమ గుర్తింపు తెలియకుండా జాగ్రత్తపడ్డారు. దుర్శేడ్ ఏటీఎంలో చోరీ జరుగుతున్న సమయంలోనే ఎస్‌బీఐ ఢిల్లీ కార్యాలయానికి అలారం వెళ్లింది. దీంతో వారు స్థానిక అధికారులను అప్రమత్తం చేశారు. ఈ ఘటనలపై పోలీసులు రెండు వేర్వేరు కేసులు నమోదు చేసి, దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ఘటనా స్థలంలో లభించిన ఆధారాలతో పాటు సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా విశ్లేషిస్తున్నారు. దొంగలు మహారాష్ట్ర రిజిస్ట్రేషన్‌తో ఉన్న వాహనాన్ని ఉపయోగించినట్లు గుర్తించారు. ఈ వాహనాన్ని ట్రేస్ చేయడానికి టోల్‌ప్లాజాల వద్ద ఉన్న సీసీటీవీ ఫుటేజీలను కూడా పరిశీలిస్తున్నారు. ఇటీవల కాలంలో తెలంగాణలో ఏటీఎం దొంగతనాలు పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోంది. గత మే నెలలో మహబూబ్‌నగర్‌లో ఇలాగే ఒక ఎస్‌బీఐ ఏటీఎంను గ్యాస్ కట్టర్‌తో కోసి రూ. 2.30 లక్షలు ఎత్తుకెళ్లారు. వరుసగా జరుగుతున్న ఈ ఘటనల నేపథ్యంలో ఏటీఎంల వద్ద భద్రతను కట్టుదిట్టం చేసే విషయంపై పోలీసు అధికారులు బ్యాంకు అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు.

పాలిటెక్నిక్ విలీనంపై యూటర్న్.. విద్యార్థుల ఉద్యమంతో దిగొచ్చిన సర్కార్..!

మొదటిపేజీ తరువాయి.. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్ విలీనం ప్రతిపాదనపై కాంగ్రెస్ ప్రభుత్వం యూటర్న్ తీసుకుంది. జీవో 97ను నిరసిస్తూ విద్యార్థి లోకం నిర్వహించిన 37 రోజుల ఉద్యమంతో సర్కార్ దిగొచ్చింది. దాంతో, విలీనం నిర్ణయానికి బ్రేక్ పడింది. శక్తి శాఖలో ఉద్యోగుల కేటాయింపు విషయం కూడా ఇక్కడితో ముగిసినట్టే. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్ విలీనం కోసం జూలై 3వ తేదీన విడుదల చేసిన 97 జీవోపై విద్యార్థి, అధ్యాపక లోకం భగ్గుమనడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. శక్తి శాఖలో ఉద్యోగుల కేటాయింపు అంశంపై కూడా తీవ్ర నిరసను వ్యక్తమవ్వడంతో.. కేకే కమిటీ పరిస్థితులపై సీఎం రేవంత్ రెడ్డికి నివేదిక అందించింది. దాంతో, పాలిటెక్నిక్ విలీనం ప్రతిపాదనపై సర్కార్ యూటర్న్ తీసుకుంది. కాబట్టి పాత పద్ధతిలోనే డిప్లొమా విద్య.. సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కాలేజీల కొనసాగనున్నాయి. అలానే సాంకేతిక విద్యా మండలి, ఏఐసీటీఈ విధానాలు యథాతథంగా ఉండనున్నాయి. దాంతో, 37 రోజుల విద్యార్థులు, అధ్యాపకుల పోరాటానికి ఫలితం దక్కింది.

మనవాళ్లు చైనాకు పట్టుబడ్డప్పుడు నా పనైపోయిందనుకున్నా : అజిత్ దోవల్

మొదటిపేజీ తరువాయి.. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ తన ఉద్యోగ జీవితం తొలినాళ్లలో ఎదురైన ఓ క్లిష్టమైన సంఘటనను గుర్తుచేసుకున్నారు. చైనా సైన్యం తన బృందాన్ని అదుపులోకి తీసుకున్నప్పుడు, ఇక తన పనైపోయిందన్న ఆందోళనకు గురయ్యానని ఆయన వెల్లడించారు. ఐఐటీ రూర్కీ స్నాతకోత్సవంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించిన ఆయన, ఈ ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. సిక్కిం భారత్‌లో విలీనమవుతున్న సమయంలో తాను యువ ఐపీఎస్ అధికారిగా అక్కడ ఇంటెలిజెన్స్ బాధ్యతలు చూసేవాడినని దోవల్ తెలిపారు. సరిహద్దుల్లో చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఏ) కదలికలపై నిఘా పెట్టడం తన విధుల్లో భాగమని చెప్పారు. ఆ క్రమంలో, సరిహద్దు ప్రాంతంలో నిఘా కోసం ఒక బృందాన్ని పంపానని, వారు సుమారు 8 రోజుల్లో తిరిగి రావాల్సి ఉందని పేర్కొన్నారు. అయితే, రోజులు గడుస్తున్నా వారి నుంచి ఎలాంటి సమాచారం రాలేదని దోవల్ వివరించారు. "5 రోజులు, 10 రోజులు, 15 రోజులు గడిచినా వారి ఆచూకీ తెలియలేదు. హిమపాతం వంటి ప్రమాదాలు జరిగినట్లు కూడా ఎక్కడా సమాచారం లేదు. దీంతో వృత్తిపరంగా, మానవతా దృక్పథం తో తీవ్ర ఆందోళనకు గురయ్యాను" అని అన్నారు. కొన్ని రోజుల తర్వాత హెడ్ క్వార్టర్స్ నుంచి ఫోన్ వచ్చిందని, తాను పంపిన బృందం చైనా కస్టడీలో ఉందని ఉన్నతాధికారి చెప్పినప్పుడు మరింత ఆందోళన చెందానని తెలిపారు. చర్చల అనంతరం చైనా ఆ బృందాన్ని తిరిగి భారత్‌కు అప్పగించిందని దోవల్ చెప్పారు. "కానీ, వారు తిరిగి వచ్చినప్పుడు మానసికంగా, శారీరకంగా పూర్తిగా కుంగిపోయి ఉన్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై విచారణ ప్రారంభం కావడంతో, చిన్న వయసులోనే తన కెరీర్ ముగిసిపోయిందని, మరో కొత్త ఉద్యోగం చూసుకోవాలని భావించినట్లు ఆయన గుర్తుచేసుకున్నారు. అయితే, విచారణలో అసలు వాస్తవం బయటపడింది. తన బృందానికి హెడ్ క్వార్టర్స్ నుంచి అందించిన మ్యాపులు, స్కెచ్‌లలో లోపాలు ఉన్నాయని, ఆ తప్పిదం కారణంగానే వారు దారి తప్పి చైనా భూభాగంలోకి వెళ్లారని తేలింది. దీంతో ఈ ఘటనలో తన తప్పేమీ లేదని నిరూపితమైనట్లు దోవల్ తన పాత జ్ఞాపకాలను పంచుకున్నారు.

నేను వాళ్లూ, వీళ్లూ వదిలిన బాణాన్ని కాదు : కవిత

మొదటిపేజీ తరువాయి.. తాను వాళ్లూ వీళ్లూ వదిలిన బాణాన్ని కాదని, దశాబ్దాలుగా అధికారానికి, విద్యకు దూరంగా ఉన్న బహుజనుల బాణాన్ని అని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. యువత, బహుజనుల హక్కుల కోసం ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌తో అయినా కొట్లాడటానికి సిద్ధమని ఆమె ప్రకటించారు. వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో ఆదివారం నిర్వహించిన 'పాంచజన్య సంకల్ప సభ'లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభకు ముందు కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీగా వేదిక వద్దకు చేరుకున్న కవిత, తన రాజకీయ వైఖరిని వివరిస్తూ ప్రత్యర్థులపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "నన్ను కాంగ్రెస్ వదిలిన బాణమని బీఆర్ఎస్ వాళ్లు, కేసీఆర్ వదిలిన బాణమని రేవంత్‌రెడ్డి అంటున్నారు. మరికొందరు తలకాయ లేనివాళ్లు బీజేపీ బాణమని మాట్లాడుతున్నారు. కొడంగల్ గడ్డపై నుంచి నేను ఒక్కటే చెబుతున్నా. నేను తెలంగాణ బహుజనుల బాణాన్ని. యువజనుల యుద్ధ నినాదాన్ని. అంబేడ్కర్ వాదాన్ని, మహాత్మ జ్యోతిబా ఫులే ఆత్మగౌరవ నినాదాన్ని నేను" అని కవిత ఉద్ఘాటించారు. ఒక మహిళ ఎవరి మద్దతు లేకుండా రాజకీయంగా నిలబడగలదని నిరూపించేందుకే ఇక్కడికి వచ్చానని, ప్రజలు తనకు ధైర్యం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కవిత విమర్శలు చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గట్టు, కేటీ దొడ్డి మండలాల్లో అక్షరాస్యత రేటు అఫ్గానిస్తాన్‌తో సమానంగా ఉందని, గతంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన రేవంత్ రెడ్డి అప్పుడు ఏం చేశారని నిలదీశారు. దేశంలో మహిళలను మహారాణులుగా కీర్తిస్తారని, కానీ వంటింట్లోని గిన్నెల మీద కూడా మగవాళ్ల పేర్లే ఉంటాయని ఆవేదన వ్యక్తం చేశారు. 29 రాష్ట్రాలున్న దేశంలో కేవలం ఒక్క రాష్ట్రానికి మాత్రమే మహిళ ముఖ్యమంత్రిగా ఉన్నారని గుర్తుచేశారు. బహుజనులు, మహిళలు, యువత రాజకీయంగా ఎదిగేందుకు తన పోరాటం కొనసాగుతుందని కవిత తెలిపారు.

దళితుల భూముల్లో అంగుళం కూడా తీసుకోం..

ఆయన మాటలు నమ్మొద్దు - మంత్రి పొంగులేటి

మొదటిపేజీ తరువాయి.. రాష్ట్రంలోని దళితుల భూముల్లో అంగుళం కూడా ప్రభుత్వం తీసుకోదని, వారి భూములకు పూర్తి భద్రత కల్పిస్తామని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం స్పష్టం చేశారు. దళితులు, గిరిజనుల భూములను లాక్కోవడం ప్రజల ప్రభుత్వ విధానం కాదని ఆయన తేల్చిచెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం దళితుల భూములకు పూర్తి రక్షణ కవచంగా నిలుస్తుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. దళితులు, గిరిజనులు, బడుగు బలహీన వర్గాల ఆశీస్సులతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని పొంగులేటి పేర్కొన్నారు. సామాజిక న్యాయం, పేదల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వాల ప్రధాన ప్రాధాన్యతలని అన్నారు. భూసంస్కరణలు, భూ పంపిణీ వంటి చారిత్రక నిర్ణయాలతో నిరుపేద దళితులకు భూములు ఇచ్చి హక్కులు కల్పించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో సుమారు 25 లక్షల ఎకరాల భూమిని దళితులకు, 2 లక్షల ఎకరాల పోడు భూములను గిరిజనులకు పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని పేర్కొన్నారు. అధికారంలోకి వస్తే దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని చెప్పి మోసం చేసిన 'దొర' కేసీఆర్ మాటలను నమ్మవద్దని ఆయన ప్రజలను కోరారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌పై విచారణ జరుపుతామని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించిన నేపథ్యంలో ఈ వివాదం మొదలైంది. ఈ ఫామ్‌హౌస్ దాదాపు 700 ఎకరాల్లో విస్తరించి ఉందని, అందులో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని ముఖ్యమంత్రి ఆరోపించారు. ఈ క్రమంలోనే ఎర్రవల్లి గ్రామానికి చెందిన 120 మంది దళిత రైతులకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. భూ యాజమాన్య హక్కులకు సంబంధించిన పత్రాలతో హాజరుకావాలని ఆ నోటీసుల్లో పేర్కొనడంతో దళితుల్లో ఆందోళన మొదలైంది. ఈ నేపథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. "ప్రభుత్వం మీ భూమిలో అంగుళం కూడా తీసుకోదు. మీ భూములను స్వాధీనం చేసుకునే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి లేదు. మీ భూముల విషయంలో ఎలాంటి భయం, ఆందోళన అవసరం లేదు. ప్రజల ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది" అని దళితులకు భరోసా ఇచ్చారు. భూ రికార్డుల పరిశీలన, సర్వే, భూ సమస్యల పరిష్కారం వంటి ప్రక్రియలను భూములు లాక్కోవడంగా చూడటం సరికాదని ఆయన హితవు పలికారు. ప్రజల భూ హక్కులను స్పష్టంగా నమోదు చేయడం, వివాదాలను పరిష్కరించడం, వారి హక్కులకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. కొంతమంది శక్తిమంతమైన వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం దళితులను రెచ్చగొట్టేందుకు ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తూ భయాందోళనలు సృష్టిస్తున్నారని మంత్రి ఆరోపించారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఇలాంటి ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి చర్య చట్టబద్ధంగా, పారదర్శకంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

రహిమున్నీస బేగంకు మెరుగైన వైద్యం అందించాలి : ఎమ్మెల్యే నాయిని



హన్మకొండ, సెప్టెంబర్ 20 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న ప్రముఖ ఉద్యమ నాయకురాలు రహిమున్నీస బేగం తీవ్ర అనారోగ్యంతో హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ఆమె తీవ్ర నిఘా విభాగంలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్‌రెడ్డి శనివారం రాత్రి ఆసుపత్రికి చేరుకుని ఆమెను పరామర్శించారు. రహిమున్నీస బేగం ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, ఆమెకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. మెరుగైన, అత్యుత్తమ వైద్యం అందించాలని ఆసుపత్రి వైద్యులు, సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో రహిమున్నీస బేగం చేసిన సేవలు, పోరాటాలు అభినందనీయమని అన్నారు. ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బేగం చికిత్సకు అయ్యే మొత్తం ఖర్చును తానే భరిస్తానని ప్రకటించారు. కుటుంబ సభ్యులు ఎలాంటి ఆర్థిక భారం భరించాల్సిన అవసరం లేదని, అధైర్యప డకుండా ధైర్యంగా ఉండాలని వారికి భరోసా ఇచ్చారు.

నయీంనగర్‌లో ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు

- ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన గణనాథుడు
- భక్తులకు మహా అన్నదానం





హనుమకొండ, సెప్టెంబర్ 20 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండ పట్టణ పరిధిలోని 54వ డివిజన్ నయీంనగర్‌లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గణనాథుడిని నిర్వాహకులు ప్రత్యేకంగా అలంకరించి, వేద మంత్రోచ్ఛారణల నడుమ విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గణనాథుడిని దర్శించుకునేందుకు నగరం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడగా, భక్తుల జయజయధ్వానాలతో నయీంనగర్ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. పూజా కార్యక్రమాల అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున మహా అన్నదానం నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లు, మంచినీటి సదుపాయం, పార్కింగ్ తదితర ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. రానున్న రోజుల్లో గణేష్ నవరాత్రి ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహించడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

కాటాపురం ప్రాథమిక వైద్యశాలకు 108 సౌకర్యం కల్పించాలి

- ప్రజల అత్యవసర అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే స్పందించాలి : మాజీ ఎంపీటీసీ దానుక నరసింహారావు



ములుగు జిల్లా /తాడ్వాయి, సెప్టెంబర్ 20 (నిత్యం నిఘా ప్రతినిధి): తాడ్వాయి మండల పరిధిలోని కాటాపురం ప్రాథమిక వైద్యశాలలో ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు 108 అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని మాజీ ఎంపీటీసీ దానుక నరసింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా దానుక నరసింహారావు మాట్లాడుతూ తాడ్వాయి మండలంలోని అతిపెద్ద గ్రామపంచాయతీలలో కాటాపురం ఒకటని, ప్రస్తుతం గ్రామంలో డెంగ్యూ జ్వరాలతో పలువురు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అత్యవసర వైద్య రవాణా సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాటాపురం చుట్టుపక్కల సుమారు ఆరు గ్రామపంచాయతీల ప్రజలు వైద్య అవసరాల కోసం ఇక్కడి ప్రాథమిక వైద్యశాలపై ఆధారపడుతున్నారని పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ప్రాథమిక వైద్యశాలలో వైద్య సిబ్బంది కొరత కూడా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సమస్యలపై గతంలో స్థానిక డీఎంహెచ్‌వోను సంప్రదించగా సానుకూలంగా స్పందించారని, అయితే ఇప్పటివరకు 108 సౌకర్యం ఆచరణలోకి రాలేదని దానుక నరసింహారావు అన్నారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు తక్షణ వైద్య రవాణా అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా కాటాపురం ప్రధాన రహదారిపై ఇసుక లారీలు అధికంగా రాక పోకలు సాగిస్తున్నాయని, సింగిల్ రోడ్డుపై ప్రమాదాల ముప్పు ఉందని ఆయన తెలిపారు. రహదారి భద్రతపై కూడా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలకు అత్యవసర సమయాల్లో వాహనాలు సకాలంలో అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. తల్లి, శిశువుల భద్రతను దృష్టిలో ఉంచుకుని కాటాపురం ప్రాథమిక వైద్యశాలకు వెంటనే 108 అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని దానుక నరసింహారావు ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల అత్యవసర వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో ఘనంగా మహా అన్నదానం

- గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నదానం
- రాధమ్మ–కృష్ణమూర్తి దంపతులకు సన్మానం



ములుగు జిల్లా / గోవింద రావుపేట, సెప్టెంబర్ 20 (నిత్యం నిఘా ప్రతినిధి): గోవింద రావుపేట మండలంలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముండ్రాతి రాధమ్మ–కృష్ణమూర్తి దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ చైర్మన్ పిఎంకె గాంధీ, ఉత్సవ కమిటీ అధ్యక్షులు జంపాల సత్యనారాయణ, ఉపాధ్యక్షులు జెట్టి శోభన్, ప్రధాన కార్యదర్శి వగురూరి వెంకటరమణ, కోశాధికారి కొలసాని శ్రీనివాసరావు తదితరుల ఆధ్వర్యంలో రాధమ్మ–కృష్ణమూర్తి దంపతులను ఘనంగా సన్మానించారు. అన్నదాన కార్యక్రమానికి సహకరించిన దంపతులను అభినందిస్తూ, శ్రీ గణపతి స్వామి కృపతో వారు, వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆలయ కమిటీ సభ్యులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మాచినేని రాధాకృష్ణ, జెట్టి రాజు, వల్లప్పనేని జగన్‌మోహన్, ఈర్ల పాపులు, గుండిమేడ సాంబశివరావు, జంపాల చంద్రశేఖర్, చిటికల శివ, ఆకుతోట ప్రవీణ్‌కుమార్, శవ నరేష్, గుర్రం వేణు, సదానందం తదితరులు పాల్గొన్నారు.

శవానికే రక్షణ లేదా..?

- వర్ధన్నపేట శవపరీక్ష గదిలో దారుణం.. మృతుడి కంటిని కొరికేసిన ఎలుకలు
- ఫ్రీజర్ సౌకర్యం లేకపోవడంపై బంధువుల ఆగ్రహం.. అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు



వరంగల్/వర్ధన్నపేట, సెప్టెంబర్ 20 (నిత్యం నిఘా ప్రతినిధి): వర్ధన్నపేట ప్రభుత్వ వైద్యశాలలోని శవపరీక్ష గదిలో మృతదేహాల భద్రతపై తీవ్ర ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రాయపర్తి మండలానికి చెందిన గారే వీరయ్య మృతదేహాన్ని ఎలుకలు కొరికిన ఘటన కలకలం రేపింది. ఏకంగా మృతుడి కంటి భాగాన్ని ఎలుకలు కొరికేయడంతో కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆదివారం ఉదయం పోస్టుమార్టం కోసం మృతదేహం వద్దకు వెళ్లిన కుటుంబ సభ్యులు ఈ దృశ్యాన్ని గమనించారు. అప్పటికే కుటుంబ పెద్దను కోల్పోయిన విషాదంలో ఉన్న తమకు మృతదేహం సైతం ఎలుకల బారిన పడటం మరింత ఆవేదనకు గురిచేసిందని వారు వాపోయారు.

మృతదేహాల భద్రతపై ప్రశ్నలు

శవపరీక్ష గదిలో మృతదేహాలను భద్రపరిచేందుకు అవసరమైన ఫ్రీజర్ సౌకర్యం లేకపోవడం, పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని మృతుడి బంధువులు ఆరోపించారు. మృతదేహానికి కనీస రక్షణ కల్పించలేని స్థితిలో శవపరీక్ష గది నిర్వహణ సాగుతోందంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. “జీవించి ఉన్నవారికి రక్షణ కల్పించడం ఒక బాధ్యత. చనిపోయిన తర్వాత కూడా మృతదేహానికి గౌరవం, భద్రత కల్పించాల్సిందే. అలాంటిది మృతదేహాన్ని ఎలుకలు కొరికే పరిస్థితి రావడం ఏమిటి?” అంటూ బంధువులు ప్రశ్నించారు.

ఉన్నతాధికారులు స్పందించాలి

శవపరీక్ష గదిలోకి ఎలుకలు ఎలా ప్రవేశిస్తున్నాయి? మృతదేహాల భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? ఫ్రీజర్ సౌకర్యం ఎందుకు ఏర్పాటు చేయలేదు? పారిశుద్ధ్య నిర్వహణను ఎవరు పర్యవేక్షిస్తున్నారు? అనే ప్రశ్నలు ఇప్పుడు ముందుకొస్తున్నాయి. ఈ ఘటనపై సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి శవపరీక్ష గది నిర్వహణపై సమగ్ర విచారణ చేపట్టాలని, లోపాలకు కారణమైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని మృతుడి కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. మృతదేహానికే కనీస రక్షణ కల్పించలేని పరిస్థితి వెలుగులోకి రావడంతో వర్ధన్నపేట ప్రభుత్వ వైద్యశాలలోని మౌలిక వసతులు, పారిశుద్ధ్య నిర్వహణపై మరోసారి చర్చ మొదలైంది.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

గణపతి మండపాల్లో గుండు సుధారాణి సందడి



వరంగల్, సెప్టెంబర్ 20 (నిత్యం నిఘా ప్రతినిధి): శ్రీ గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వరంగల్ నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణపతి మండపాలను కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్, మాజీ రాజ్యసభ సభ్యురాలు, గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ మాజీ మేయర్ గుండు సుధారాణి ప్రభాకర్ దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. కాశిబుగ్గ చౌరస్తాలో కాశిబుగ్గ వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాన్ని దర్శించుకున్న గుండు సుధారాణి ప్రభాకర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడ నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.



అనంతరం 'ఓ సిటీ' క్లబ్ హౌస్, కాశిబుగ్గ పద్మనగర్, మణికంఠ కాలనీ, రంగ శాయిపేటలోని మేరవాడ శివాలయం, తెలంగాణ కాలనీ-2, ఎస్ఆర్ఆర్ తోట ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణపతి మండపాలను సందర్శించారు. ఆయా ప్రాంతాల్లో గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు గుండు సుధారాణి ప్రభాకర్ దంపతులకు స్వాగతం పలికి ప్రత్యేకంగా సత్కరించారు. గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయి.

ఉచిత పోలీస్ ఉద్యోగ కోచింగ్‌కు స్క్రీనింగ్ టెస్ట్

- ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ కోసం ఎంపిక ప్రక్రియ
- 54.07 శాతం మంది అభ్యర్థుల హాజరు
- పరీక్షా కేంద్రాలను పరిశీలించిన డీసీపీలు



వరంగల్, సెప్టెంబర్ 20 (నిత్యం నిఘా ప్రతినిధి): ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో అందించనున్న ఉచిత పోలీస్ ఉద్యోగ కోచింగ్ కోసం ఆదివారం స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొత్తం ఐదు పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. ఈ స్క్రీనింగ్ టెస్ట్‌కు 54.07 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పోలీస్ అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాలను డీసీపీలు స్వయంగా పరిశీలించి, పరీక్ష నిర్వహణ తీరును పర్యవేక్షించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, నిబంధనల మేరకు పరీక్ష నిర్వహించేలా సిబ్బందికి సూచనలు చేశారు.

కానిస్టేబుల్ భార్య ఆత్మహత్య

- నాగేంద్రనగర్‌లో విషాద ఘటన..
- ఇంటి సెల్లార్‌లో ఉరివేసుకుని మృతి



హనుమకొండ, సెప్టెంబర్ 20 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండ సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని రెవెన్యూ కాలనీ నాగేంద్రనగర్‌లో విషాద ఘటన చోటు చేసుకుంది. పోలీస్ కానిస్టేబుల్ బిర్రు అనిల్ భార్య శిరీష (36) ఇంటి సెల్లార్‌లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. హెడ్‌క్వార్టర్స్‌లోని వేలిముద్రల విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న అనిల్‌తో శిరీషకు 2014లో వివాహమైంది. ఆర్థిక ఇబ్బందులు, దంపతుల మధ్య నెలకొన్న కుటుంబ కలహాలే ఆత్మహత్యకు కారణమై ఉండవచ్చని ప్రాథమికంగా తెలుస్తోంది. శిరీష తండ్రి వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుబేదారి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, ఘటనకు దారితీసిన పరిస్థితులపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

పోటీ పరీక్షల అభ్యర్థులకు మాక్ టెస్ట్

- అంబేద్కర్ స్టడీస్ సెంటర్ - విష్ణు ఐఏఎస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహణ
- ప్రశ్నపత్రాన్ని విడుదల చేసిన ఓఎస్డీ ప్రొఫెసర్ వెంకట్ రామ్ రెడ్డి
- పెద్ద సంఖ్యలో హాజరైన విద్యార్థులు



హనుమకొండ, సెప్టెంబర్ 20 (నిత్యం నిఘా ప్రతినిధి): పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల్లో పరీక్షలపై అవగాహన, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టడీస్ సెంటర్–విష్ణు ఐఏఎస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో మాక్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాక్ టెస్ట్ ప్రశ్నపత్రాన్ని ముఖ్య అతిథులు అధికారికంగా విడుదల చేశారు. కార్యక్రమానికి ఓఎస్డీ ప్రొఫెసర్ వెంకట్ రామ్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, విష్ణు ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ పి. విష్ణు వర్ధన్ గౌడ్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పుల్లా శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వెంకట్ రామ్ రెడ్డి మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు మాక్ టెస్ట్‌లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. వీటి ద్వారా తమ సామర్థ్యాన్ని అంచనా వేసుకోవడంతో పాటు పరీక్షా విధానంపై అవగాహన పెంపొందించుకోవచ్చని తెలిపారు. పూర్తి ఏకాగ్రత, పట్టుదలతో నిరంతరం కృషి చేస్తే పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చని సూచించారు. ప్రొఫెసర్ ఈసం నారాయణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తనలోని ప్రతిభను గుర్తించి, స్పష్టమైన లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. నిరంతర సాధన, క్రమశిక్షణతో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విష్ణు ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ పి. విష్ణు వర్ధన్ గౌడ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిని అన్ని రంగాల్లో ప్రోత్సహించడమే అకాడమీ లక్ష్యమని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన మార్గదర్శకత్వం, శిక్షణ అందించేందుకు అకాడమీ నిరంతరం కృషి చేస్తుందని చెప్పారు. విద్యార్థుల సౌకర్యార్థం మాక్ టెస్ట్‌లతో పాటు ఆన్‌లైన్ తరగతులను కూడా అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పి. భాస్కర్, బి. రాజు, డి. ఆనందం, వై. బాబు, ఎస్. రాజమౌళి, రాజమహేంద్రతో పాటు పలువురు అధ్యాపకులు, అకాడమీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు. మాక్ టెస్ట్‌కు పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు.

వినాయక మండపాలను సందర్శించిన నాయిని నీలిమ

- గణనాథుడికి ప్రత్యేక పూజలు.. నిర్వాహకులకు శుభాకాంక్షలు
- ప్రశాంత వాతావరణంలో గణపతి నవరాత్రి ఉత్సవాల నిర్వహించుకోవాలని ఆకాంక్ష





హనుమకొండ, సెప్టెంబర్ 20 (నిత్యం నిఘా ప్రతినిధి): గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని పరిధిలనం, 29వ, 51వ, 6వ డివిజన్ల పరిధిలో స్థానికంగా ఏర్పాటు చేసిన వినాయక మండపాలను వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి సతీమణి నాయిని నీలిమ రాజేందర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా మండపాల్లో కొలువుదీరిన గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండపాల నిర్వాహకులు, భక్తులతో మాట్లాడి ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్ల వివరాలను తెలుసుకున్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని గణనాథుడిని ప్రార్థించినట్లు నాయిని నీలిమ తెలిపారు. ఈ సందర్భంగా మండపాల నిర్వాహకులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. కార్యక్రమాల్లో ఆయా డివిజన్ల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

మంథనిలో ఘనంగా జల్సా సీరత్-ఉన్-నబీ

- ప్రవక్త మహమ్మద్ బోధనలు మానవతా విలువలకు ప్రతీక
- ప్రేమ, దయ, కరుణ, సహనం, సోదరభావంతో జీవించాలని మత పెద్దల సూచన



పెద్దపల్లి జిల్లా/మంథని, సెప్టెంబర్ 20 (నిత్యం నిఘా ప్రతినిధి): మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో జల్సా సీరత్-ఉన్-నబీ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎస్ఎల్‌బీ ఫంక్షన్ హాల్‌లో సాలేహా మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ యాకుబ్ పాషా ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మత పెద్దలు ప్రవక్త మహమ్మద్ జీవిత చరిత్ర, ఆయన బోధనలు, సమాజానికి అందించిన సందేశాలను వివరించారు. కార్యక్రమంతో ఫంక్షన్ హాల్‌లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ప్రవక్త మహమ్మద్ చూపిన మార్గం, ఆయన జీవితం ద్వారా సమాజానికి అందించిన సందేశాలను మత పెద్దలు వివరించారు. ప్రేమ, దయ, కరుణ, సహనం, సోదరభావం, పేదల పట్ల ఆదరణ, ఇతరులను గౌరవించడం వంటి మానవతా విలువలను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఆచరించాలని సూచించారు. సమాజంలో శాంతి, ఐక్యత, సౌభ్రాతృత్వం పెంపొందించడంలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమని పేర్కొన్నారు. మనుషుల మధ్య భేదాలను పక్కనపెట్టి పరస్పరం గౌరవించుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కుటుంబం నుంచే ప్రేమ, గౌరవం, మానవతా విలువలను పెంపొందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మత పెద్దలు సూచించారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

విద్య, వైద్యం ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండాలి

- **తల్లిదండ్రుల తర్వాత విద్యార్థులకు మరో తల్లిదండ్రుల్లా ఉపాధ్యాయులు : ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**
- **ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా**
- **ఆరోగ్య కార్డుల అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తా**

హనుమకొండ, సెప్టెంబర్ 20 (నిత్యం నిఘా ప్రతినిధి): విద్య, వైద్యం ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇస్తున్నాయని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండలోని శ్రీహర్ష కన్వెన్షన్‌లో తెలంగాణ ఆల్ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఘనంగా సన్మానించి అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేట్ ఉపాధ్యాయులు తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఒక సంఘంగా ఏర్పడి ముందుకు సాగాలని సూచించారు. కలిసికట్టుగా పోరాడితే సాధించలేనిది ఏమీ లేదన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, తల్లిదండ్రుల తర్వాత విద్యార్థులకు మార్గనిర్దేశం చేసేవారు ఉపాధ్యాయులేనని పేర్కొన్నారు. ఉపాధ్యాయ వృత్తి కేవలం ఉద్యోగం కాదని, సమాజానికి విద్యను అందించే బాధ్యతతో కూడిన సేవ అని అన్నారు. ప్రైవేట్ ఉపాధ్యాయుల ఆరోగ్య భద్రత కోసం ఆరోగ్య కార్డుల అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి చర్చిస్తానని నాయిని తెలిపారు. ఈ వారంలోనే ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లి, వచ్చే ఏడాది నాటికి అమలు చేసే విధంగా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ఇటీవల అసెంబ్లీలో వరంగల్‌లో ఉపాధ్యాయులు, ఇతర వర్గాలకు అవసరమైన గృహాల అంశాన్ని ప్రస్తావించినట్లు చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో స్థలాలు లేని వారికి ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించి అందించే అంశాన్ని పరిశీలించాలని కోరినట్లు తెలిపారు. సుమారు 2,000 ఇళ్లను వరంగల్‌కు కేటాయించాలని కోరగా, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హైదరాబాద్‌తో పాటు వరంగల్‌ను కూడా పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలకు అర్హులైన ప్రైవేట్ ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకుని ప్రయోజనం పొందాలని ఎమ్మెల్యే సూచించారు. ఉపాధ్యాయులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్ల పంపిణీలో ప్రైవేట్ ఉపాధ్యాయులకు కూడా తన వంతుగా కొందరికి ఇళ్లు అందించినట్లు పేర్కొన్నారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి శుభాకాంక్షలు తెలిపిన నాయిని రాజేందర్ రెడ్డి, భవిష్యత్తులో మరింత సేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చందర్ లాల్ నాయక్ చౌహన్, పాలకమండలి సభ్యులు, హనుమకొండ, కాజీపేట మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.



ప్రమాదం జరిగాకే మేల్కొంటారా?

- **మూలమలుపులో మట్టి కుప్ప.. వాహనదారులకు పొంచి ఉన్న ప్రమాదం**
- **అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం.. ప్రమాదం జరిగేలోపే తొలగించాలని డిమాండ్**



పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 20 (నిత్యం నిఘా ప్రతినిధి): మంథని పట్టణంలోని లైన్‌గడ్డ సమీప ప్రధాన రహదారిపై మూలమలుపులో మట్టి కుప్ప ప్రమాదానికి ఆహ్వానం పలుకుతోంది. రహదారిపై ప్రమాదకరంగా మట్టి పేరుకుపోయి ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై వాహనదారులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూలమలుపు కావడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో పాటు రహదారిపై ఉన్న మట్టి కుప్పతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగే వరకు అధికారులు వేచి చూడాలా? రహదారిపై ప్రమాదకర పరిస్థితి కనిపిస్తున్నప్పుడే చర్యలు తీసుకోలేరా? అంటూ వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం పెద్ద ప్రమాదానికి దారితీసే అవకాశం ఉన్నందున అధికారులు తక్షణమే స్పందించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు రహదారిపై ఉన్న మట్టి కుప్పను తొలగించడంతో పాటు ఆర్‌అండ్‌బీ అధికారులు కూడా రహదారి భద్రతపై దృష్టి సారించాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించిన తర్వాత స్పందించడం కాకుండా ముందుగానే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కుటుంబ కలహాల నేపథ్యంలో తల్లి ముగ్గురు పిల్లలతో అదృశ్యం

- **పుట్టింటికి వెళ్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన మహిళ.. ఆచూకీ కోసం పోలీసుల గాలింపు**
- **భర్తతో గొడవ జరిగిన అనంతరం ఘటన.. తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు**







నిజామాబాద్ జిల్లా/కోటగిరి, సెప్టెంబర్ 20 (నిత్యం నిఘా ప్రతినిధి): కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ మహిళ తన ముగ్గురు పిల్లలతో కలిసి అదృశ్యమైన ఘటన నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలంలో చోటు చేసుకుంది. యాద్గార్‌పూర్ గ్రామానికి చెందిన బి. సాయి లత తన భర్త ప్రశాంత్‌తో శుక్రవారం కుటుంబ విషయమై గొడవ పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం సాయిలత తన ముగ్గురు పిల్లలు చైతన్య, చైత్ర, చైతులతో కలిసి ఎత్తొడ క్యాంప్‌లోని పుట్టింటికి వెళ్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లినట్లు తెలిపారు. అయితే వారు పుట్టింటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. భర్త ప్రశాంత్ ఈ విషయా న్ని సాయిలత తండ్రి లక్ష్మణ్‌కు సమా చారం అందించగా, ఆయన యాద్గార్ పూర్‌కు వచ్చి పరిసర ప్రాంతాల్లో వెతికి నా వారి ఆచూకీ లభించ లేదు. సాయి లత ఇంటి నుంచి వెళ్లే సమయంలో ఆకుపచ్చ రంగు పంజాబీ దుస్తులు ధరించి ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమెకు తెలుగు, కన్నడ, మరాఠీ భాషలు మాట్లాడటం వచ్చునని పేర్కొన్నారు. సాయిలత తండ్రి లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. అదృశ్యమైన తల్లి, ముగ్గురు పిల్లల ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

గణేష్ ఉత్సవాల్లో మతసామరస్యానికి ప్రతీకగా మహా అన్నదానం

- **అన్నదానంలో పాల్గొన్న ముస్లిం సోదరులు**
- **జామా మసీదు కమిటీ అధ్యక్షుడికి ఘన సన్మానం**



ఏటూరునాగారం, సెప్టెంబర్ 20 (నిత్యం నిఘా ప్రతినిధి): గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏటూరునాగారం మండల కేంద్రంలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమం మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది. ఈ అన్నదాన కార్యక్రమంలో స్థానిక ముస్లిం సోదరులు పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. కులమతాలకు అతీతంగా వివిధ వర్గాల ప్రజలు కలిసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా ఏటూరునాగారంలో నెలకొన్న సోదరభావం, సామాజిక ఐక్యతను చాటి చెప్పారు. గణేష్ ఉత్సవాల్లో ముస్లిం సోదరులు భాగస్వాములు కావడాన్ని పలువురు అభినందించారు. పండుగలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు అన్ని వర్గాల ప్రజలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి పరస్పర గౌరవం, స్నేహభావాన్ని పెంపొందిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఏటూరునాగారం జామా మసీదు కమిటీ అధ్యక్షుడు సయ్యద్ అబ్జల్ పాషాను శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. మతసామరస్యాన్ని చాటే ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని పలువురు పేర్కొన్నారు. “మతాలు వేరైనా.. మనసులు ఒక్కటే” అనే సందేశాన్ని చాటుతూ నిర్వహించిన ఈ మహా అన్నదానం ఏటూరునాగారం ప్రాంతంలో సోదరభావానికి, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కిశోర్ కుమార్, సభ్యులు రంజిత్, చిన్ని కృష్ణ, ఆకుల శ్రీను, కందకట్ల శ్రీను, ప్రసాద్, కళ్యాణ్, అన్వర్, అలీ, అఫ్రిది, బాబా, చోటు, మహేమూద్, సోనూ, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

కాటాపురం ఐలాపురంలో ఘనంగా అన్నదానం

- విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు.. భక్తిశ్రద్ధలతో అన్నదాన కార్యక్రమం

ములుగు జిల్లా / తాడ్వాయి, సెప్టెంబర్ 20 (నిత్యం నిఘా ప్రతినిధి) : తాడ్వాయి మండల పరిధిలోని కాటాపురం గ్రామం ఐలాపురంలో స్థానిక ఉపసర్పంచ్ పాలకుర్తి వెంకట రామనరసయ్య (బాబు) ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అర్చకులు సదానంద చారి సమక్షంలో విఘ్నేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి నైవేద్యం సమర్పించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ పాలకుర్తి బాబు మాట్లాడుతూ ప్రజలందరూ భగవంతునిపై విశ్వాసం, భక్తిని పెంపొందించుకోవాలని అన్నారు. మన సంపాదనలో కొంత భాగాన్ని ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడానికి వినియోగించాలని సూచించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, ఈ సంవత్సరం పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజల విఘ్నాలు తొలగిపోవాలని విఘ్నేశ్వర స్వామిని ప్రార్థించారు. అదేవిధంగా ప్రజలంతా కుల, మత, రాగద్వేషాలకు అతీతంగా ఐకమత్యంతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అన్నదాతలు పాలకుర్తి బాబు–చంద్రకళ దంపతులు, ముంజ ప్రదీప్–సుమలత, హరీష్–అనూష, రమేష్–శైలజ, పలనాటి సంతోష్, గడ్డం రంజిత్, వెన్నెలగట్టు సంతోష్, రోహిత్, వలబోజు భరత్, గడ్డం శంకర్, బొప్పారం బాబు తదితరులు పాల్గొన్నారు.



నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

బీరెల్లిలో బీఆర్ఎస్ నాయకుడిపై సస్పెన్షన్ వేటు

- పార్టీ అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేశారనే ఆరోపణ
- అంతర్గత విచారణలో రుజువైందని గ్రామ కమిటీ అధ్యక్షుడి వెల్లడి



ములుగు జిల్లా/తాడ్వాయి, సెప్టెంబర్ 20 (నిత్యం నిఘా ప్రతినిధి): తాడ్వాయి మండలం బీరెల్లి గ్రామానికి చెందిన ఓబు నాగేష్‌ను బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ఆ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దాయ రోశయ్య తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా పార్టీ క్రియాశీల కార్యకర్తగా పనిచేస్తున్న నాగేష్.. ఇటీవల గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా పార్టీ అభ్యర్థులకు వ్యతిరేకంగా పని చేశారని ఆరోపించారు. పార్టీ అభ్యర్థుల విజయానికి వ్యతిరేకంగా వ్యవహరించడంతో పాటు పార్టీ నిర్ణయాలకు విరుద్ధంగా పనిచేశారనే అంశంపై అంతర్గతంగా విచారణ నిర్వహించినట్లు రోశయ్య తెలిపారు. ఈ విచారణలో ఆరోపణలు రుజువైనందున ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షుడి సూచనలతో నాగేష్‌పై సస్పెన్షన్ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇకపై ఓబు నాగేష్‌కు బీఆర్ఎస్ పార్టీతో ఎలాంటి సంబంధం ఉండదని, పార్టీ కార్యకర్తలు ఈ విషయాన్ని గమనించాలని గ్రామ కమిటీ అధ్యక్షుడు దాయ రోశయ్య తెలిపారు.

ఆటో గిరాకీ తగ్గి.. ఈఎంఐల భారం పెరిగి యువకుడి మృతి

- ఫైనాన్స్ ఒత్తిడితో తీవ్ర ఆందోళనకు గురయ్యాడని కుటుంబ సభ్యుల ఆరోపణ
- దామోదర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికుల విజ్ఞప్తి



ములుగు జిల్లా/ తాడ్వాయి, సెప్టెంబర్ 20 (నిత్యం నిఘా ప్రతినిధి): బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న తాడ్వాయి మండలం నార్లాపూర్ గ్రామానికి చెందిన సుతారపు దామోదర్ మృతి విషాదాన్ని నింపింది. ఆటోకు గిరాకీ తగ్గడం, నెలవారీ వాయిదాలు చెల్లించలేకపోవడం, ఫైనాన్స్ ప్రతినిధుల ఒత్తిడి కారణంగా తీవ్ర మానసిక ఆందోళనకు గురై గుండెపోటుతో మృతి చెందాడని కుటుంబ సభ్యులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి వచ్చిన తర్వాత ఆటోలకు గిరాకీ తగ్గిందని, దీంతో దామోదర్‌కు ఆదాయం తగ్గిపోయిందని వారు తెలిపారు. మరోవైపు ఆటోకు సంబంధించిన నెలవారీ వాయిదాలు చెల్లించాల్సి రావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాడని పేర్కొన్నారు. ఫైనాన్స్ ప్రతినిధుల ఒత్తిడి కూడా పెరగడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యాడని, చివరకు గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దామోదర్ మృతితో నార్లాపూర్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబానికి ప్రధాన ఆధారమైన యువకుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.ఈ నేపథ్యంలో ఆటో యూనియన్లు, యువజన సంఘాలు దామోదర్ కుటుంబానికి అండగా నిలవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబానికి తగిన ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, వాయిదాల భారంపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన సర్పంచ్ కాకులమర్రి శ్రీలత

- ముళ్లకట్ట బ్రిడ్జి వద్ద ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష
- విద్యుత్ దీపాలు, భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి



ఏటూరునాగారం,సెప్టెంబర్ 20 (నిత్యం నిఘా ప్రతినిధి): ఈ నెల 23న జరగనున్న వినాయక నిమజ్జన మహోత్సవాన్ని పురస్కరించుకుని ఏటూరునాగారం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత ముళ్లకట్ట బ్రిడ్జి ప్రాంతంలో నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. పంచాయతీ అధికారులు, పోలీసు సిబ్బందితో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించి అవసరమైన ఏర్పాట్లపై సమీక్షించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అధికారులతో చర్చించారు. బ్రిడ్జి పరిసరాల్లో విద్యుత్ దీపాల ఏర్పాటు, భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి పలు సూచనలు చేశారు. నిమజ్జన సమయంలో భక్తులు, నిర్వాహకులు ఇబ్బందులు ఎదుర్కోకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఈ పరిశీలనలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు, గ్రామ పంచాయతీ కార్యదర్శి జనార్దన్, ఉపసర్పంచ్ ఎల్లయ్య, వార్డు సభ్యులు, స్థానిక పోలీసు సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గణపతి సేవలో వేణుకు ఘన సన్మానం

- మూడేళ్లుగా ఒక్క రూపాయి ఆశించకుండా వంటల సేవ
- నిస్వార్థ సేవను గుర్తించి గంగాపురి యువత ఘనంగా అభినందన



పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 20 (నిత్యం నిఘా ప్రతినిధి): దైవభక్తితో చేసే సేవకు ప్రతిఫలం ఆశించాల్సిన అవసరం లేదని నిరూపిస్తూ, గణపతి ఉత్సవాల్లో గత మూడేళ్లుగా నిస్వార్థంగా సేవలందిస్తున్న వేణును గంగాపురి యూత్ గణపతి యువకులు ఘనంగా సన్మానించారు. గంగాపురి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద గణపతి నవరాత్రుల సందర్భంగా భక్తులకు నిర్వహించే కార్యక్రమాల్లో వేణు స్వచ్ఛందంగా వంటలు వండుతూ తన సేవలను అందిస్తున్నారు. ఎలాంటి పారితోషికం ఆశించకుండా గణపతిపై ఉన్న భక్తి, విశ్వాసంతో యువతతో కలిసి సేవ చేయడం ఆయన ప్రత్యేకతగా నిలిచింది. వేణు నిస్వార్థ సేవలను గుర్తించిన గంగాపురి యూత్ గణపతి యువకులు మండపం వద్ద ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ.. వేణు దైవభక్తితో పాటు యువత పట్ల ఆప్యాయతతో అందిస్తున్న సేవలు తమకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ.. గణపతిపై ఉన్న భక్తితోనే గత మూడేళ్లుగా వంటల సేవ చేస్తున్నానని తెలిపారు. ఒక్క రూపాయి కూడా ఆశించకుండా గణపతికి, యువతకు సేవ చేసే అవకాశం లభించడం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. యువత చూపిస్తున్న ప్రేమాభిమానాలు, సన్మానం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చాయని, గణపతి ఆశీస్సులతో ప్రతి సంవత్సరం ఇలాగే సేవ చేసే అవకాశం కలగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. దైవ భక్తితో కూడిన నిస్వార్థ సేవకు గుర్తింపుగా వేణును సన్మానించిన గంగాపురి యువతను పలువురు అభినందించారు.

తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరమ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బొల్లెపాక రాజేష్

- ఏకగ్రీవంగా ఎన్నిక.. జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమం కోసం కృషి
- ప్రతి జిల్లాలో ఫోరమ్ బలోపేతానికి ప్రాధాన్యం: రాజేష్





ధర్మసాగర్,సెప్టెంబర్ 20 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరమ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ ముచ్చట్లు దిన పత్రిక సంపాదకులు బొల్లెపాక రాజేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని ఫోరమ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బూర్గుల నాగేందర్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీసీసీఈ భవన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సులో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన బొల్లెపాక రాజేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని మాదిగ జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఫోరమ్‌ను బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. యువ జర్నలిస్టులకు మార్గదర్శకత్వం, వృత్తిపరమైన శిక్షణ అందించేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. మహిళా జర్నలిస్టుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని రాజేష్ అన్నారు. వ్యక్తిగత ప్రయోజనాలకు అతీతంగా మాదిగ జర్నలిస్టుల సమష్టి ప్రయోజనాల కోసం ఫోరమ్‌ను బలమైన వేదికగా తీర్చిదిద్దేందుకు నూతన కార్యవర్గంతో కలిసి పనిచేస్తానని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల మధ్య ఐక్యతను పెంపొందించి, కష్టకాలంలో సభ్యులకు అండగా నిలిచే విధంగా ఫోరమ్‌ను ముందుకు తీసుకెళ్తామని రాజేష్ తెలిపారు.

నేడు ప్రజావాణి

- కలెక్టరేట్, ఆర్డీవో, ఎంపీడీవో కార్యాలయాల్లో వినతుల స్వీకరణ
- ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారుల చర్యలు



హనుమకొండ,సెప్టెంబర్ 20 (నిత్యం నిఘా ప్రతినిధి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంతో పాటు హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాలు, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఆయా కార్యాలయాలకు వచ్చే ప్రజల నుంచి వినతులు, అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.జిల్లా ప్రజలు తమ సమస్యలను ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సూచించారు.

శ్రీనివాస నగర్‌లో వైభవంగా గణేష్ ఉత్సవాలుకుంకుమ పూజలు, అన్నదానం.. దాతలకు ఘన సన్మానం





నిత్యం నిఘా, సూర్యాపేట , సెప్టెంబర్ 20 కోదాడ పట్టణంలోని 30వ వార్డు శ్రీనివాస నగర్‌లో మదర్ తెరిసా సేవా యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 25వ వార్షిక గణేష్ నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి.ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు గణేష్ మండపం వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం గణపతికి ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహించి భక్తులకు యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి 30వ వార్డు కౌన్సిలర్ కారింగుల ఉమా అంజన్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.మదర్ తెరిసా సేవా యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ ఉత్సవాలు విజయవంతంగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, ఉత్సవాల నిర్వహణకు సహకరించిన దాతలను, యూత్ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వార్డు పెద్దలు, కాలనీ మహిళలు, యూత్ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణేష్ ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

కాకులమర్రి లక్ష్మణ్ బాబు సమక్షంలో బీఆర్ఎస్‌లో ఉద్యమకారుల చేరిక

- గోల్కొండ రాజు ఆధ్వర్యంలో పలువురు ఉద్యమకారులు పార్టీలో చేరిక
- మల్లంపల్లి అభివృద్ధి కోసం రాజకీయ వేదికగా పోరాటం కొనసాగిస్తామని వెల్లడి

ములుగు జిల్లా / మల్లంపల్లి, సెప్టెంబర్ 20 (నిత్యం నిఘా ప్రతినిధి): ములుగులోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మల్లంపల్లి మండల పార్టీ అధ్యక్షుడు పాలేపు శీను ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల సాధన సమితి అధ్యక్షుడు గోల్కొండ రాజు ఆధ్వర్యంలోని పలువురు ఉద్యమకారులు బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీ నాయకుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో కొత్తగా చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మల్లంపల్లి మండల సాధన కోసం గతంలో ప్రజలతో కలిసి ఉద్యమించిన ఉద్యమకారులు.. మండలం ఏర్పడిన నేపథ్యంలో అభివృద్ధి కోసం రాజకీయంగా ముందుకు సాగాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.



మండల సాధన ఉద్యమం నుంచి అభివృద్ధి పోరాటం

ఈ సందర్భంగా మండల సాధన సమితి అధ్యక్షుడు గోల్కొండ రాజు మాట్లాడుతూ.. మల్లంపల్లి మండల సాధన తమ ఉద్యమ ప్రస్థానంలో ముఖ్యమైన ఘట్టమని అన్నారు. అయితే మండలం ఏర్పడినంత మాత్రాన ప్రజల సమస్యలు పూర్తిగా పరిష్కారం కావని పేర్కొన్నారు. మల్లంపల్లికి అవసరమైన ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఆసుపత్రి, అత్యవసర వైద్య సేవలు, పోలీస్ స్టేషన్, బస్‌స్టాండ్, గ్రంథాలయం, విద్యా సదుపాయాలు, రహదారులు తదితర మౌలిక వసతుల కోసం ప్రజల తరఫున నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో డబ్బు పంపిణీ, ప్రలోభాలకు దూరంగా ప్రజల మధ్యకు వెళ్లి సుమారు 600 ఓట్లు సాధించామని రాజు పేర్కొన్నారు. ఆ ఓట్లను తమపై ప్రజలు ఉంచిన నమ్మకానికి ప్రతీకగా భావిస్తున్నామని తెలిపారు.

“డబ్బుతో వచ్చిన ఓటు ఒకరోజు ఉంటుంది.. నమ్మకంతో వచ్చిన ఓటు తరతరాలు ఉంటుంది” అని ఆయన పేర్కొన్నారు.

ఉద్యమ నేపథ్యంతో మేరుగు రాజు

పార్టీలో చేరిన మేరుగు రాజుకు తెలంగాణ ఉద్యమం, విద్యార్థి ఉద్యమం, ప్రజా సంఘాల కార్యకలాపాల్లో భాగస్వామ్యమైన నేపథ్యం ఉందని తెలిపారు. గతంలో ఇండియన్ లెజెండ్స్ యూత్ అధ్యక్షుడిగా పనిచేసిన ఆయన.. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం వేదికగా ఉద్యమంలో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఆదివాసీ హక్కులు, బడుగు బలహీన వర్గాల హక్కులు, సామాజిక న్యాయం కోసం జరిగిన వివిధ ప్రజా ఉద్యమాల్లోనూ భాగస్వామ్యమయ్యానని మేరుగు రాజు తెలిపారు. ఇకపై ప్రజా సమస్యల పరిష్కారానికి రాజకీయ వేదిక ద్వారా తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

మల్లంపల్లి అభివృద్ధే తదుపరి లక్ష్యం

“మండలం సాధించడం ఒక లక్ష్యం.. మండలం అభివృద్ధి చెందేలా చేయడం మరో లక్ష్యం” అనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని ఉద్యమకారులు తెలిపారు. మల్లంపల్లి మండలానికి అవసరమైన మౌలిక వసతుల సాధన కోసం ప్రజలను కలుపుకొని పనిచేస్తామని, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఒన్నాల మహేష్, బత్తిని అజయ్, ముడెడ్ల నవీన్, గోల్కొండ మహేందర్, పల్లెబోయిన అరవింద్, రుత్విక్, ఎం.డి. అఫ్సర్, కూరాకుల వంశీ, కార్తిక్, గుండ కర్ణాకర్, గాజు అజయ్, ఎస్.కె. పాషా తదితరులు పాల్గొన్నారు.అలాగే శ్రీనగర్ సర్పంచ్ ఆకుల మల్లేష్, మాజీ ఎంపీటీసీ మాచర్ల ప్రభాకర్, మొర్రి రాజుయాదవ్, నారోజు హరినాథ్, శ్రీనివాస్ రెడ్డి, మహమ్మద్ జాని, మహమ్మద్ చోటు, మహమ్మద్ పాషా, బక్కి శ్రీను, నాయకుల ప్రభాకర్, తూర్పాటి మధు, సుధాకర్ రెడ్డి, రాయల్ రవి, సతీష్, సంపత్, గోవింద నాయక్, గోపాలరెడ్డి, వినయ్ కుమార్, ఏటూరునాగారం సర్పంచ్ శ్రీలత, జంగాలపల్లి సర్పంచ్ మోహన్, భూక్యా మురళి, బుల్లెట్ ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనానికి ప్రత్యేక పోలీస్ బందోబస్తు

- హైటెన్షన్ వైర్లకు దూరంగా నిర్దేశిత మార్గంలోనే విగ్రహాల ఊరేగింపు
- డీజేలకు అనుమతి లేదు.. మద్యం సేవించి వాహనాలు నడపొద్దు: ఎస్పీ

ములుగు, సెప్టెంబర్ 20 (నిత్యం నిఘా ప్రతినిధి): ములుగు జిల్లాలో గణేశ్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామ్‌నాథ్ ఐపీఎస్ తెలిపారు. నిమజ్జన ప్రాంతాల్లో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల రాకపోకలు, విగ్రహాల ఊరేగింపుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. విగ్రహాల ఊరేగింపు సమయంలో హైటెన్షన్ విద్యుత్ తీగలకు తగలకుండా పోలీసులు నిర్దేశించిన మార్గంలోనే విగ్రహాలను తీసుకెళ్లాలని ఎస్పీ సూచించారు. విద్యుత్ స్తంభాలు, తీగలు, ఇతర ప్రమాదకర ప్రాంతాల వద్ద నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.నిమజ్జన కార్యక్రమాల్లో డీజేలకు అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు. మైకులకు అనుమతి కోసం ఏటూరునాగారం ప్రాంతానికి చెందిన వారు ఏటూరునాగారం ఏఎస్పీ వద్ద, ములుగు సబ్ డివిజన్ పరిధిలోని వారు ములుగు డీఎస్పీ వద్ద అనుమతి పొందాలని సూచించారు. చెరువులు, వాగులు, కాలువలు, ఇతర నీటి వనరుల వద్ద నిమజ్జనం సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఈత రాని వారు నీటిలోకి వెళ్లవద్దని సూచించారు. చిన్నారులను నిమజ్జన ప్రాంతాలకు తీసుకువచ్చే తల్లిదండ్రులు వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. నిమజ్జనం కోసం వచ్చే వాహనాలను నిర్దేశించిన మార్గాల్లోనే నడపాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా పోలీసులకు సహకరించాలని ఎస్పీ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, బాణాసంచా కాల్చవద్దని సూచించారు. ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించకుండా నిబంధనలు పాటించాలని కోరారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ



నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తుందని ఎస్పీ తెలిపారు. ప్రజలు పోలీసుల సూచనలు, నిబంధనలు పాటిస్తూ గణేశ్ నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు.ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు ములుగు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఎస్పీ కేకన్ సుధీర్ రామ్‌నాథ్ తెలిపారు.

వల్బపూర్‌లో ఘనంగా గణపతి మహాసేన క్రికెట్ టోర్నమెంట్

- యువత క్రీడల్లో రాణించాలి: ఎస్సై నర్సింహారావు

హనుమకొండ /ఎల్కతుర్తి, సెప్టెంబర్ 20 (నిత్యం నిఘా ప్రతినిధి): ఎల్కతుర్తి మండలం వల్బపూర్ గ్రామ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2026 గణపతి మహాసేన క్రికెట్ టోర్నమెంట్ను ఘనంగా నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌ను ఎల్కతుర్తి ఎస్సై నర్సింహారావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై నర్సింహారావు మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. క్రీడా పోటీలను స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహించుకోవాలని, గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తిని చాటాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, జిల్లా ఉపసర్పంచుల ఫోరం హనుమకొండ జిల్లా అధ్యక్షులు అంబాల అనిల్, కమలాపూర్ మండల కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు శని గరపు రమేష్, అడ్వకేట్ పవన్ పాల్గొన్నారు. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇలాంటి టోర్నమెంట్లు నిర్వహించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించడంలో నిర్వాహకులు అంబాల సృజన్, అంబాల అభిలాష్, సందీప్, అఖిల్, దయాకర్, వంశీ, శ్రీకాంత్, మహేష్, తరుణ్, కమల్, రాకేష్, ఠాగూర్, శ్రీరామ్, నాగరాజు, మున్నా తదితరులు కీలకంగా వ్యవహరించారు. పలువురు క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. టోర్నమెంట్‌లో సృజన్ జట్టు విజేతగా, అభిలాష్ జట్టు రన్నరప్‌గా నిలిచాయి. విజేత, రన్నరప్ జట్లను నిర్వాహకులు అభినందించారు. యువత క్రీడలపై ఆసక్తి పెంచుకుని గ్రామీణ స్థాయి నుంచే ప్రతిభను వెలికితీయాలనే ఉద్దేశంతో ఈ టోర్నమెంట్ నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.



బాలగణపతి మండపం వద్ద ఘనంగా మహా అన్నదానం

- భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న గణపతి నవరాత్రి ఉత్సవాలు

జనగామ జిల్లా / రఘునాథ్‌పల్లి, సెప్టెంబర్ 20 (నిత్యం నిఘా ప్రతినిధి): రఘునాథ్‌పల్లి మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు గ్రామంలోని 7వ వార్డులో ఏర్పాటు చేసిన బాలగణపతి వినాయక మండపం వద్ద బాలగణపతి యూత్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుడిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. “సమస్త దానాల్లో అన్నదానం గొప్పది – అన్నదాత సుఖీభవ” అనే భావనతో గత మూడు సంవత్సరాలుగా ఇబ్రహీంపూర్ గ్రామంలోని వివిధ వినాయక మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని నిర్వాహకులు తెలిపారు.బాలగణపతి కృపాకటాక్షాలు గ్రామ ప్రజలందరిపై ఉండాలని, గ్రామంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని, పశుపక్ష్యాదులు సుఖసంతోషాలతో ఉండాలని యూత్ సభ్యులు ప్రత్యేకంగా ప్రార్థించారు. గత ఏడాది బాలగణపతి విగ్రహాన్ని భద్రాచలంలో నిమజ్జనం చేయగా, ఈ ఏడాది శ్రీశైలంలో నిమజ్జనం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మహా అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఇబ్రహీంపూర్ గ్రామ ప్రజలు, గణేష్ భక్తులు, కాలనీవాసులు, గ్రామ పెద్దలు, యువకులు, వివిధ గణపతి మండపాల నిర్వాహకులకు బాలగణపతి యూత్ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూనె మల్లేష్, దోరగొల్ల కుమార్, పులి రామదాసు, పులి కార్తీక్, నల్ల నరేష్, ల్యాగాల సమ్మన్న, దోరగొల్ల శ్రీనివాస్, ల్యాగాల అనిల్, కౌడగాని కుమార్ తదితర యూత్ సభ్యులు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో గణనాథుని సన్నిధిలో మహా అన్నదానం

భక్తిశ్రద్ధలతో పూజలు.. పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు



వరంగల్ / వర్ధన్నపేట,సెప్టెంబర్ 20 (నిత్యం నిఘా ప్రతినిధి): వర్ధన్నపేట మండలం కొత్తపల్లి గ్రామంలో వినాయక చవితి సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా, గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. దీంతో గ్రామంలో భక్తిమయ వాతావరణం నెలకొంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాజేష్ ఖన్నా, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కమ్మగోని స్వామి రాయుడు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాళ్లపల్లి యాదగిరి గౌడ్, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ బచ్చల స్వామి, యూత్ సభ్యులు, మహిళలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గణనాథుని ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

అనారోగ్యంతో చికిత్స పొందుతున్న సహచర విద్యార్థినిని పరామర్శించిన 1987-88 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

- 39 ఏళ్లైనా చెక్కుచెదరని స్నేహబంధం
- కష్టసుఖాల్లో ఒకరికొకరు అండగా పూర్వ విద్యార్థులు



హనుమకొండ /ఎల్కతుర్తి, సెప్టెంబర్ 20 (నిత్యం నిఘా ప్రతినిధి): అనారోగ్యంతో చికిత్స పొందుతున్న తమ సహచర విద్యార్థిని స్వర్ణలతను 1987–88 బ్యాచ్ పూర్వ విద్యార్థులు పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు వరంగల్ జిల్లా చంద్రకొండకు వెళ్లిన పూర్వ విద్యార్థులు, స్వర్ణలత కుటుంబ సభ్యులను కలిసి ఆమెకు ధైర్యం చెప్పారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్ గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 1987–88 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన సుమారు 86 మంది పూర్వ విద్యార్థులు ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు చేస్తూ తమ కుటుంబాలతో జీవిస్తున్నారు. విద్యాభ్యాసం పూర్తై 39 సంవత్సరాలు గడిచినా తమ మధ్య ఏర్పడిన స్నేహబంధాన్ని కొనసాగిస్తూ కష్టసుఖాల్లో ఒకరికొకరు అండగా నిలుస్తున్నారు. తమ సహచర విద్యార్థిని స్వర్ణలత అనారోగ్యంతో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆమెను పరామర్శించేందుకు చంద్రకొండకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థి దశలో పాటలు పాడుతూ, యాంకర్‌గా వ్యవహరిస్తూ పాఠశాలలో నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్న స్వర్ణలతతో తమకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు. స్వర్ణలత త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి తిరిగి రావాలని, భవిష్యత్‌లో ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా సుఖసంతోషాలతో జీవించాలని 1987–88 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆకాంక్షించారు. ఆమె కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

39 ఏళ్లైనా చెక్కుచెదరని స్నేహబంధం

చదువు పూర్తయి దశాబ్దాలు గడిచినా తమ మధ్య ఉన్న ఆత్మీయత, స్నేహబంధం చెక్కుచెదరకుండా కొనసాగడం పట్ల పూర్వ విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. కష్టాల్లో ఉన్న సహచరులకు భవిష్యత్‌లోనూ అండగా నిలుస్తూ, ఒకరికొకరు తోడుగా ఉంటామని పేర్కొన్నారు. తమ స్నేహబంధం ఇదే విధంగా మరెన్నో సంవత్సరాలు కొనసాగాలని ఆకాంక్షించారు.

కాటాపురం వైన్ షాప్‌పై ఫిర్యాదులు.. ఎక్సైజ్ శాఖ నిఘా ఎక్కడ?

- క్వార్టర్ సీసాపై అదనపు వసూళ్ల ఆరోపణలు
- గుడుంబా విక్రయాలపైనా ఫిర్యాదులు.. చర్యల కోసం ప్రజల ఎదురుచూపు



ములుగు జిల్లా / తాడ్వాయి, సెప్టెంబర్ 20 (నిత్యం నిఘా ప్రతినిధి) ములుగు జిల్లా ఏజెన్సీ ప్రాంతమైన తాడ్వాయి మండలంలో మద్యం విక్రయాలు, గుడుంబా తయారీ–విక్రయాలపై ఎక్సైజ్ శాఖ పర్యవేక్షణ తీరుపై ప్రజల్లో అనేక ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా కాటాపురం గ్రామంలో ఉన్న ఏకైక మద్యం దుకాణం నిర్వహణపై స్థానికులు పలు ఆరోపణలు చేస్తున్నారు. కాటాపురంలోని మద్యం దుకాణంలో క్వార్టర్ సీసాపై నిర్ణీత ధరకు అదనంగా రూ.20 నుంచి రూ.30 వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదనపు ధరపై ప్రశ్నిస్తే పట్టించుకోని ధోరణి కనిపిస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయంపై ఎక్సైజ్ అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు కనిపించలేదని వారు అంటున్నారు. అదేవిధంగా దుకాణంలో మద్యం విక్రయాల నిర్వహణపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా కనిపించే మద్యం దుకాణాల తరహాలో కాకుండా ఈ దుకాణం నిర్వహణ ఉందని, బీర్లను చల్లగా ఉంచేందుకు అవసరమైన సౌకర్యాలు కూడా లేవని స్థానికులు చెబుతున్నారు. దుకాణానికి సంబంధించిన అనుమతులు, గుర్తింపు వివరాలు, ధరల పట్టిక తదితర అంశాలను అధికారులు తనిఖీ చేయాలని వారు కోరుతున్నారు. ఇక తాడ్వాయి మండలంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో గుడుంబా తయారీ, విక్రయాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా కాటాపురం చుట్టుపక్కల గ్రామాల్లో గుడుంబా తయారీ కేంద్రాలు, విక్రయ ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. మద్యం దుకాణంలో అదనపు వసూళ్లపై అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందన లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై సంబంధిత అధికారులను సంప్రదించినప్పటికీ చర్యలు తీసుకున్నట్లు సమాచారం అందలేదని వారు చెబుతున్నారు.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలి

కాటాపురం మద్యం దుకాణంలో విక్రయాలు, ధరల వసూళ్లు, అనుమతులు, దుకాణ నిర్వహణపై సమగ్ర తనిఖీ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. అదే సమయంలో తాడ్వాయి మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లో గుడుంబా తయారీ, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆరోపణలపై అధికారుల వివరణ ఏమిటో?

కాటాపురం మద్యం దుకాణంపై వస్తున్న ఆరోపణలు నిజమా? కాదా? అనే విషయాన్ని ఎక్సైజ్ శాఖ అధికారులు తనిఖీ చేసి ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. అదనపు ధరలకు మద్యం విక్రయిస్తున్నట్లు తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటారా? గుడుంబా తయారీ కేంద్రాలపై ఎలాంటి నిఘా కొనసాగుతోంది? అనే ప్రశ్నలకు జిల్లా ఎక్సైజ్ అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది.

క్రీడా మైదానంగా మారిన గణపతి మండపం

- మహిళలు, యువత ఉత్సాహంగా పాల్గొన్న క్రీడా పోటీలు



పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 20 (నిత్యం నిఘా ప్రతినిధి):
గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గంగాపురి యూత్ గణపతి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి. గంగాపురి నాలుగో వార్డు కౌన్సిలర్ ఎరుకల స్రవంతి, రమేష్ బాబు క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో మహిళలు, పురుషులు, యువత పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.
ఈ సందర్భంగా కౌన్సిలర్ ఎరుకల స్రవంతి, రమేష్ బాబు మాట్లాడుతూ గంగాపురి యూత్ గణపతి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తాము కూడా క్రీడల్లో పాల్గొనడం మరింత సంతోషాన్ని కలిగించిందని తెలిపారు. మహిళలు క్రీడలపై మరింత ఆసక్తి పెంచుకుని ప్రతి రంగంలోనూ ముందుకు సాగాలని, తమ ప్రతిభను చాటుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

క్రీడలతో ఆరోగ్యం.. ఉత్సాహం

గంగాపురి యూత్ సభ్యులు మాట్లాడుతూ క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని తెలిపారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఉత్సాహం, ఏకాగ్రత పెరగడంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని పేర్కొన్నారు.
యువత, మహిళలను క్రీడల వైపు ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఈ క్రీడా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మహిళలు, యువత ఉత్సాహంగా క్రీడా పోటీల్లో పాల్గొనడంతో గణపతి మండపం వద్ద సందడి నెలకొంది. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన క్రీడాకారులు, పాల్గొన్న ప్రతి ఒక్కరినీ నిర్వాహకులు అభినందించారు

మద్యం మహమ్మారిపై మాదిగ సంఘాల సమరశంఖం

- అక్టోబర్ 2న కలెక్టరేట్ ముట్టడి.. అక్టోబర్ 7న అమరావతిలో జాతీయ సదస్సు
- వర్ధన్నపేటలో MRPS–MSP మండల నాయకుల సమీక్ష సమావేశం



వరంగల్ / వర్ధన్నపేట, సెప్టెంబర్ 20(నిత్యం నిఘా ప్రతినిధి): మద్యం కారణంగా పేద కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని, మద్యపాన నియంత్రణ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని MRPS–MSP నాయకులు తెలిపారు. అక్టోబర్ 2న వరంగల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వర్ధన్నపేట మండల కేంద్రంలోని తక్షశీల స్కూల్‌లో MRPS–MSP మండల నాయకులతో సమీక్ష సమావేశాన్ని మండల ఇన్‌చార్జి జిల్లా ధర్మన్న మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి MSP జాతీయ నాయకులు, వరంగల్ జిల్లా ఇన్‌చార్జి వంగూరి ఆనంద్ రావ్ మాదిగ ముఖ్య అతిథిగా, MRPS వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షులు కట్ల రాజశేఖర్ మాదిగ విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వంగూరి ఆనంద్ రావ్ మాదిగ మాట్లాడుతూ మద్యం కారణంగా అనేక కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. మద్యం మత్తులో హత్యలు, అత్యాచారాలు, రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ముఖ్యంగా నిరుపేద కుటుంబాలపై మద్యపానం ప్రభావం అధికంగా ఉంటోందని పేర్కొన్నారు. మద్యపాన సమస్యకు పరిష్కారం కోసం, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు అక్టోబర్ 2న వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అదేవిధంగా మందకృష్ణ మాదిగ భవిష్యత్ కార్యాచరణలో భాగంగా అక్టోబర్ 7న అమరావతిలో నిర్వహించనున్న నూతన మండల కమిటీల జాతీయ సదస్సును జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

ఉద్యమ కార్యాచరణకు మండల స్థాయిలో సన్నద్ధత

మద్యపాన నియంత్రణ అంశంతో పాటు సంఘటనా బలోపేతం, నూతన మండల కమిటీల సమన్వయం, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణపై సమావేశంలో చర్చించారు. గ్రామస్థాయి నుంచి నాయకులు, కార్యకర్తలను సమీకరించి రానున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని నాయకులు సూచించారు. ఈ సమావేశంలో MSP వర్ధన్నపేట మండల అధ్యక్షులు ముత్యాల మల్లేష్ మాదిగ, MRPS వర్ధన్నపేట మండల అధ్యక్షులు చాడ కరుణాకర్ మాదిగతో పాటు వివిధ గ్రామాల అధ్యక్షులు, MRPS–MSP నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

సంగెం మండల గణేశ్ ఉత్సవ కమిటీలకు అభినయ ట్రస్టు ఘన సత్కారం

- ఉత్సవ కమిటీలను ప్రోత్సహించేందుకు నగదు బహుమతులు.. మెమెంటోలు, శాలువాలతో సన్మానం
- 21, 22, 23 తేదీల్లో మండపాల ప్రత్యేక పరిశీలన

వరంగల్ / సంగెం, సెప్టెంబర్ 20 (నిత్యం నిఘా ప్రతినిధి):
సంగెం మండల పరిధిలో సుమారు 120 విఘ్నేశ్వర మండపాల్లో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో అభినయ ట్రస్టు ఫౌండర్ అండ్ చైర్మన్ అన్నమనేని సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ట్రస్టు కమిటీ సభ్యులు, మిత్రబృందం కలిసి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణేశ్ మండపాలను సందర్శించి, ఉత్సవ కమిటీలు నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ, యజ్ఞాలు, హోమాలు, నైవేద్యాలు, ప్రత్యేక పూజలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను పరిశీలించారు. సాంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహిస్తున్న కమిటీలను అభినయ ట్రస్టు ప్రతినిధులు అభినందించారు.



ప్రోత్సాహక బహుమతులు

గణేశ్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాస్త్రోక్తంగా, సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీలను ప్రోత్సహించేందుకు అభినయ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతులను ప్రకటించారు.

– ప్రథమ బహుమతి: ₹10,116
– ద్వితీయ బహుమతులు: ఐదు ఉత్సవ కమిటీలకు ఒక్కొక్కరికి ₹5,116
– మండలంలోని ప్రతి గణేశ్ ఉత్సవ కమిటీకి మెమెంటో/షీల్డ్స్, శాలువాలతో ఘన సత్కారం

ప్రముఖుల హాజరు

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి, మాస్టర్ జీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ సుందరాజు యాదవ్, విశిష్ట అతిథిగా శ్రీ చైతన్యానంద జీ స్వామీజీ పాల్గొన్నారు.
అలాగే కాపులకనపర్తి గ్రామ సర్పంచ్ చంద్రమౌళి, ఆశాలపల్లి గ్రామ సర్పంచ్ కిషోర్, బీజేపీ మండల అధ్యక్షులు చంద్రమౌళి, బుట్టి కుమారస్వామి, నరసింహారెడ్డి తదితర ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, ఉత్సవ కమిటీ సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అదేవిధంగా వరంగల్ మహానగర్ గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు, విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర, వరంగల్ నగర మరియు వివిధ స్థాయిల బాధ్యులు ప్రత్యేక అతిథులుగా పాల్గొని కార్యక్రమానికి తమ ఆశీస్సులు అందించారు.

21, 22, 23 తేదీల్లో ప్రత్యేక పరిశీలన

గణేశ్ నవరాత్రుల 7వ, 8వ, 9వ రోజుల్లో అంటే సెప్టెంబర్ 21, 22, 23 తేదీలలో మండలంలోని వివిధ గణేశ్ మండపాలను అభినయ ట్రస్టు ప్రతినిధులు సందర్శించనున్నారు. ఆయా మండపాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలను పరిశీలించి, వాటి ఆధారంగా తదుపరి ప్రోత్సాహక బహుమతులను ప్రకటించనున్నట్లు తెలిపారు.

సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాం

అభినయ ట్రస్టు భవిష్యత్తులో కూడా ఆధ్యాత్మిక, సామాజిక, సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ ప్రజలకు, యువతకు, సమాజానికి అండగా నిలుస్తుందని ట్రస్టు ఫౌండర్ అండ్ చైర్మన్ అన్నమనేని సంతోష్ కుమార్ తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన పత్రికా మిత్రులు, వివిధ సంఘాల ప్రతినిధులు, ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులకు అభినయ ట్రస్టు తరఫున ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో విజయవంతంగా నిర్వహిస్తున్న ప్రతి ఉత్సవ కమిటీ సభ్యులకు అభినయ ట్రస్టు తరఫున హృదయపూర్వక అభినందనలు తెలిపారు

నల్లబెల్లిలో పేదలకు సీఎం సహాయనిధి అండ

- రూ.1.77 లక్షల CMRF చెక్కుల పంపిణీ
- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు చొరవతో లబ్ధిదారులకు ఆర్థిక భరోసా



వరంగల్ / వర్ధన్నపేట,సెప్టెంబర్ 20 (నిత్యం నిఘా ప్రతినిధి): ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (CMRF) అండగా నిలుస్తోంది. వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు నల్లబెల్లి గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ఆదివారం ఉదయం CMRF చెక్కులను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా మొత్తం రూ.1,77,000 విలువైన నాలుగు CMRF చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.
చెక్కులు అందుకున్న లబ్ధిదారులు

– తోపుచర్ల దేవేందర్ రావు — రూ.60,000
– పలపాటి కమలాకర్ రావు — రూ.52,000
– జన్నపురెడ్డి మాధవ రెడ్డి — రూ.20,000
– మల్యాల శ్రావ్య — రూ.45,000

వైద్య చికిత్సలు, అనారోగ్య పరిస్థితులతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు CMRF ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం కొంతమేర ఊరట, భరోసాను కల్పిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అవసరమైన సహాయం అందేలా కృషి చేస్తామని నాయకులు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా నాయకులు బిర్రు రాజు, నల్లబెల్లి కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు తాటికాయల దిలీప్, జిల్లా నాయకులు జక్కి గోపాల్, గ్రామ పార్టీ ఉపాధ్యక్షులు ముత్యం యాకన్న, వార్డు సభ్యులు మరుపట్ల ప్రశాంత్, ఎలాబోయిన సదానందం, ఆరెల్లి నాగరాజు, బిర్రు సురేందర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బిర్రు భాస్కర్, దుగ్యాల దేవేందర్ రావు, బోల్లపెల్లి కుమార్, జన్నపరెడ్డి సంపత్ రెడ్డి, బోల్లపెల్లి యాకాంబరం, వడ్డే నారాయణ, బిర్రు పెద్ద యాకయ్య, బిర్రు మధు తదితర నాయకులు పాల్గొన్నారు.

యువతకు అవకాశం ఇస్తే నాయకత్వం ఎలా ఉంటుందో నిదర్శనం

- కార్యకర్త నుంచి మండల అధ్యక్షుడి వరకు అంచలంచెలుగా ఎదుగుదల

హనుమకొండ /ఎల్కతుర్తి, సెప్టెంబర్ 20 (నిత్యం నిఘా ప్రతినిధి):
ఒక సాధారణ కార్యకర్తగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి, భారతీయ జనతా పార్టీలో అంచలంచెలుగా ఎదుగుతూ ఎల్కతుర్తి మండల బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. మండల అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తూ కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. రాష్ట్ర స్థాయి నుంచి పార్టీ పిలుపునిచ్చే కార్యక్రమాలను మండల స్థాయిలో నిర్వహించేందుకు కార్యకర్తలను సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై చేపట్టే కార్యక్రమాలు, సమావేశాలు, నిరసనలు, సేవా కార్యక్రమాల్లో కార్యకర్తలతో కలిసి పాల్గొంటున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాలను విస్తరించడంతో పాటు కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్న తీరు చర్చనీయాంశంగా మారిందన్నారు.

యువతకు బాధ్యత ఇస్తే.. ఫలితం

యువత రాజకీయాల్లోకి రావాలని, వారికి పార్టీల్లో కీలక బాధ్యతలు అప్పగించాలని పలువురు సూచిస్తున్న నేపథ్యంలో శ్రీకాంత్ యాదవ్ రాజకీయ ప్రస్థానం అందుకు ఒక ఉదాహరణగా నిలుస్తోందని ఆయనకు శుభాకాంక్షలు తెలిపిన వారు పేర్కొన్నారు. బాధ్యతను కేవలం పదవిగా కాకుండా పార్టీ పట్ల ఉన్న కర్తవ్యంగా భావిస్తూ కార్యకర్తలతో మమేకమై పనిచేస్తున్నారని తెలిపారు. కొత్త క్యాడర్‌ను తయారు చేయడం, గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాలను విస్తరించడం, కార్యకర్తలను సమన్వయం చేసుకోవడం వంటి అంశాల్లో ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి.



కార్యకర్తలతో మమేకం

శ్రీకాంత్ యాదవ్ కార్యకర్తలతో కలిసిమెలిసి ఉండే తీరు, అందరినీ సమన్వయం చేసుకునే విధానం ప్రత్యేకంగా నిలుస్తున్నాయని ఆయనకు శుభాకాంక్షలు తెలిపిన వారు అన్నారు. చిన్న కార్యకర్త నుంచి సీనియర్ నాయకుడి వరకు అందరితో స్నేహపూర్వకంగా మెలుగుతూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని తెలిపారు. రాష్ట్ర పార్టీ నుంచి వచ్చే ఆదేశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో చురుకైన పాత్ర పోషిస్తూ, కార్యక్రమాలకు కార్యకర్తలను సమీకరించి నిర్వహిస్తున్నారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.



పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు

మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని బాధ్యతలు చేపట్టి ప్రజలకు, యువతకు సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వీఎస్ ఎల్కతుర్తి మండల అధ్యక్షులు అడ్డూరి అనిల్ మాదిగ శ్రీకాంత్ యాదవ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మార్వీఎస్ ఎల్కతుర్తి మండల పక్షాన హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు, యువతకు సేవలందించాలని ఆకాంక్షించారు. ఒక కార్యకర్తగా ప్రారంభమైన రాజకీయ ప్రయాణం మండల అధ్యక్షుడి బాధ్యత వరకు సాగడం, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ కార్యకర్తలతో కలిసి ముందుకు సాగడం యువ నాయకత్వానికి ఒక ప్రత్యేక ఉదాహరణగా నిలుస్తోందని పలువురు పేర్కొన్నారు.